సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 21 । మే । 2023



ఆరోగ్య సిబ్బందికి శిక్షణ

సిరిసిల్లటౌన్: జన ఆరోగ్య సమితి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీపీఓ ఉమాదేవి, ఏవో ఆంజనేయులు పాల్గొన్నారు.



గోశాలకు వరిగడ్డి అందజేత

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలకు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన రైతు రాజమల్లయ్య, రమేశ్ రెండు ట్రాక్టర్‌ల వరిగడ్డి అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/27.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు



హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేష్

వేములవాడ: 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్'లో భాగంగా రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) స్కీమ్‌ను అన్ని వార్డులలో అమలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ తెలిపారు. భగవంతరావునగర్‌లోని వేదగాయత్రీ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆవుపేడ, సుగంధ ద్రవ్య వనమూళికలతో తయారుచేసే ధూప్ స్టిక్స్, దంతమంజన్, ధూప్‌కప్స్ వినియోగిస్తూ పర్యవరణాన్ని కాపాడుకోవాలన్నారు.

సుంకరి ఇస్సాదారుల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సుంకరి ఇస్సాదారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సుంకరి పట్టాదారులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం.. సుంకరి ఇస్సాదారులకు న్యాయం చేయాలని ఆందోళన బాటపట్టారు. మండలంలోని ఆవునూర్‌లో సుంకరి ఇస్సాదారులు శనివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, రాస్తారోకో చేపట్టారు. సుంకరి ఇస్సాదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల దేవరాజు మాట్లాడుతూ సుంకరి పట్టాదారులను అధికారులు రెగ్యులర్ చేశారని, సుంకరిపై జీవనం చేస్తున్న ఇస్సాదారులను మరిచిపోయారన్నారు. సొల్ల క్రాంతి, బత్తుల బాలయ్య, భాస్కర్, చంద్రయ్య, ప్యారం రాములు, భూమయ్య, వంశీ, కృష్ణ, ఇస్తారి, దేవయ్య పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ మొగిలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పోయిన సెల్‌ఫోన్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు శనివారం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్(సీఈఐఆర్) ద్వారా గుర్తించారు. సెల్‌ఫోన్‌ను శనివారం సీఐ మొగిలి బాధితునికి అందజేశారు. వెంకటాపూర్‌కు చెందిన దుర్గం విజయ్‌బాబు తన సెల్‌ఫోన్ మిస్సయినట్లు గత నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్‌లో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను అప్‌లోడ్ చేయగానే సెల్‌ఫోన్ ఎక్కడ ఉందో పోలీసులకు తెలిసింది. వెంటనే దాన్ని రికవరీ చేసి బాధితునికి సీఐ మొగిలి శనివారం అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఇక నుంచి ఎవరి సెల్‌ఫోన్ మిస్సయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు



పనులు పరిశీలిస్తున్న కొండల్‌రావు

కోనరావుపేట(వేములవాడ): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా రవాణాధికారి కొండల్‌రావు సూచించారు. నిమ్మపల్లిలోని ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. లారీల సమస్య ఎక్కువగా ఉందని రైతులు చెప్పడంతో వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఇళ్లలోని పాత్రల్లో, పాత కుండీల్లో, పాతటైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ కదిరె శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ప్రతాపరెడ్డి, కార్యదర్శి అనిల్ తదితరులు ఉన్నారు.

సండే స్పెషల్

రంగినేని కెరటాలు

- అమ్మానాన్నలను కోల్పోయినా ట్రస్ట్ ఒడిలో ఒదిగి.. ఉన్నతంగా చదివి
- దేశ విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి.. స్ఫూర్తిగా నిలుస్తున్న యువత

బాల్యం అమూల్యమైంది. అమ్మానాన్న ఒడిలో ఆనందంగా గడపాల్సిన సమయమది. కానీ.. పసిప్రాయంలోనే కన్నవాళ్లకు, అయినవారికి దూరమయ్యారు. ఇందులో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన వారు కొందరైతే.. వివిధ కారణాలతో అమ్మ ఆప్యాయతకు, నాన్న అనురాగానికి నోచుకోని బాల్యం మరికొందరిది. తమ భవిష్యత్ ఏంటని ఆలోచన చేస్తున్న వారికి ఆ ట్రస్టు నీడగా నిలిచింది. చదువు చెప్పించింది. కడుపునిండా అన్నం పెట్టింది. ఉండడానికి ఆశ్రయాన్నిచ్చింది. ఆ ఆశ్రయాన్ని ఆసరాగా చేసుకుని అందనంత ఎత్తుకు ఎదిగారు ఆ చిన్నారులు. రంగినేని సుజాత మోహన్‌రావు చారిటబుల్ ట్రస్ట్‌లో చదివిన 55మంది వివిధస్థాయిల్లో.. హోదాల్లో దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్నతంగా స్థిరపడి 'రంగినేని కెరటాలు'గా పేరు పొందారు. - సిరిసిల్ల



ఉద్యోగాలు చేస్తున్న ట్రస్ట్ పూర్వ విద్యార్థులతో రంగినేని సుజాత, మోహన్‌రావు దంపతులు(ఫైల్)



ఈమె మొగిలి శిరీష. జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్. సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లి. శిరీష చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. స్థానిక ఆర్‌ఎంపీ రాజేశం, టీచర్ సత్యనారాయణ శిరీషను 4వ తరగతిలో ట్రస్ట్‌లో చేర్చారు. పదో తరగతి వరకు ట్రస్ట్‌లో చదువుకుని ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ హైదరాబాద్‌లో పూర్తిచేసింది. 2014లో పోలీస్‌కానిస్టేబుల్(సివిల్)గా ఎంపికై ప్రస్తుతం జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తోంది. భర్త రవి వ్యాపారం చేస్తున్నాడు. హిమజ అనే కూతురు ఉంది. తాను ఈ స్థాయిలో ఉండేందుకు 'రంగినేని' ట్రస్ట్ కారణమని శిరీష గర్వంగా చెబుతోంది.



ఇతను పడకంటి గోవర్ధన్‌చారి. జగిత్యాల జిల్లా రాయికల్. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. సమీప బంధువులు 2004లో సిరిసిల్ల పట్టణ శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో చేర్పించారు. 8వ తరగతిలో చేరిన గోవర్ధన్ ఇక్కడే 10వ తరగతి, ఇంటర్ పూర్తిచేశాడు. 2011లో రాయికల్‌లో వుడ్ కార్వింగ్ షాపు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఐదు యూనిట్లతో మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. రంగినేని మోహన్‌రావు ప్రేరణతో ఎదిగానని గోవర్ధన్ చెబుతున్నాడు.



ఎదిగిన వారెందరో..

ఆత్మహత్యలకు పాల్పడిన నేతకార్మికుల పిల్లలు, ఎన్‌కౌంటర్ బాధితుల పిల్లలు, అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులకు కులమతాలకు అతీతంగా ట్రస్ట్‌లో ఆశ్రయం కల్పించారు. ట్రస్ట్‌లోనే అ..ఆలు నేర్చుకున్నారు. వివిధ తరగతుల్లో చేరిన వారు బీటెక్, ఎంటెక్, ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ, పాలిటెక్నిక్, బీఫార్మసీ, ఎంబీఏ చదువుకుని ఉద్యోగాలు సాధించారు. ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లల్లో 35మంది ఉద్యోగాలు, మరో 20 మంది స్వయం ఉపాధి సాధించి జీవితంలో స్థిరపడ్డారు. ఉద్యోగాలు చేస్తున్నవారు తాము సంపాదిస్తున్న జీతంలో కొంత సొమ్మును రంగినేని ట్రస్ట్ నిర్వహణకు అందిస్తున్నారు కేవలం 14 మంది పిల్లలతో మొదలై 2020 నాటికి 224మంది వరకు ఆశ్రయం ఇచ్చింది. కరోనా లాక్‌డౌన్‌తో ట్రస్టును తాత్కాలికంగా మూసివేసినా పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గుజరాత్‌లో జాబ్ చేస్తున్నా



మాది తంగళ్లపల్లి మండలం చింతలఠాణా. తొమ్మిదేళ్ల ప్రాయంలో ట్రస్ట్‌లో చేరాను. ఆరేళ్లు చదువుకున్న. ఇంటర్ సీవీ రామన్ కాలేజీలో చేశాను. ఎంసెట్ రాసి ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చేశాను. గుజరాత్‌లో లార్సెన్ అండ్ టూబ్రో కంపెనీలో మంచి వేతనంతో పని చేస్తున్నాను.
– గారిపల్లి సందీప్, గుజరాత్

మేమిద్దరం పని చేస్తున్నాం



నేను ట్రస్ట్‌లో పదోతరగతి వరకు చదివాను. హైదరాబాద్‌లో బీటెక్ చేశా. నా చదువులకు ట్రస్ట్ సాయం చేసింది. ఇప్పుడు క్యాప్‌జెమిని కంపెనీలో చేస్తున్న. మా ఆవిడ సౌమ్య టీసీఎస్‌లో చేస్తోంది. మోహన్‌రావు తాతయ్య, వెంకట్‌రావు సారు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించారు.
– తోనుపునూరి యశ్వంత్, వరంగల్

అమ్మానాన్న చనిపోయారు



మాది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రామవరం. మూడో తరగతిలోనే అమ్మానాన్న లక్ష్మీ, గట్టయ్య చనిపోయారు. 2003లో రంగినేని ట్రస్ట్‌లో చేరాను. హైదరాబాద్‌లో పీజీ చేశాను. కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న. గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న. గాయకుడిగా గుర్తింపును రంగినేని ట్రస్ట్ కల్పించింది. ఎన్నో వేదికలపై పాడాను.
– జాతరకొండ సంపత్, రామవరం

పిల్లలు స్థిరపడితే తృప్తి



ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు సాధించి స్థిరపడడం తృప్తిగా ఉంది. నాకు చేతనైన సాయం చేయాలని ట్రస్ట్ పెట్టాను. కరోనాతో ఇబ్బంది ఏర్పడినా మా అబ్బాయి నవీన్, రిటైర్డు హెచ్‌ఎం తూడి వెంకట్రావు, ముత్యంరెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ ప్రతాప్, ట్రస్ట్ సభ్యుల ప్రోత్సాహంతో మళ్లీ తెరిచాం. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం.
– రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

- సెల్‌టవర్ ఎక్కిన బీజేపీ నాయకుడు
- నాలుగు గంటలు హైడ్రామా
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో
- సర్పంచ్ ఇంటి ఎదుట కొలతలు పెట్టిన అధికారులు



రాస్తారోకో చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలంటూ బీజేపీ నాయకుడు ఉపేంద్ర శనివారం సెల్ టవర్ ఎక్కాడు. ఆదర్శంగా ఉండాల్సిన సర్పంచ్ నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ లేకుండానే భవనాన్ని నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ ముస్తాబాద్ శివారులోని సెల్‌టవర్ ఎక్కాడు. నాలుగు గంటలకుపైగా జరిగిన హైడ్రామాతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి బందోబస్తు చేపట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ముస్తాబాద్ శివారులోని సెల్‌టవర్‌ను ఉపేంద్ర ఎక్కాడనే విషయం తెలియడంతో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. సర్పంచ్ నిర్మిస్తున్న భవనాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశాడు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి రాజుతో నాయకులు వాగ్వాదానికి దిగారు. ఎలా అనుమతులు ఇచ్చారని నిలదీశారు. పనులు జరిగే స్థలానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, పోలీసులు, పంచాయతీ అధికారులు చేరుకున్నారు. పంచాయతీ తీర్మానం ప్రకారం 24 ఫీట్ల వెడల్పు రోడ్డుకు అనుగుణంగా కొలతలు తీయాలని పట్టుబట్టారు. నాలుగు ఫీట్లకు పైగా అక్రమంగా రోడ్డుపైకి వచ్చినట్లు తేలిందని, వెంటనే ఆ మేరకు నిర్మాణం తొలగించాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. జరుగుతున్న పనులపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి పేర్కొనగా.. ఆగ్రహించిన నాయకులు మరోసారి రాజీవ్‌చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. అయితే ఉపేంద్ర టవర్‌పైనే ఉండడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో ఆరీఫ్‌లు పరిస్థితిని సమీక్షించారు. నిబంధనల ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టవర్‌పై ఉన్న ఉపేంద్ర కిందికి దిగొచ్చాడు. 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. చక్రధర్‌రెడ్డి, తిరుపతి, కార్తీక్‌రెడ్డి, అంజాగౌడ్, నర్సింలు, మహేందర్, సంతోష్‌రెడ్డి, కృష్ణ, మల్లేశ్, చిగురు వెంకన్న, కిషన్, దేవేందర్, మీస శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు. పలువురిని పోలీసులు ఠాణాకు తరలించారు. నాలుగు గంటలపాటు హైడ్రామా చోటుచేసుకుంది.



టవర్‌పై బీజేపీ నాయకుడు ఉపేంద్ర (సర్కిల్‌లో)

పాత భవనంలోకి 'సెస్'

- జూన్ 1 నుంచి సేవలు షురూ
- అద్దె ఇళ్ల ఖాళీకి నిర్ణయం

సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ: సెస్ పాలకవర్గం.. అధికారులు స్పందించారు. సొంత భవనం ఉన్నప్పటికీ నూతన కార్యాలయం నిర్మిస్తామన్న సాకుతో అద్దె భవనాల్లో కొనసాగుతుండడంపై 'సాక్షి'లో 'అద్దె భవనాలపై మోజు' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. వేములవాడ టౌన్, రూరల్ కార్యాలయాలు కొనసాగుతున్న అద్దె భవనాల నుంచి ఖాళీ చేసి, సొంత భవనంలోనే విధులు నిర్వర్తించాలని నిర్ణయించారు. ఆ మేరకు శనివారం సెస్ వేములవాడరూరల్ డైరెక్టర్ ఆకుల దేవరాజం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఏఈ పవనకుమారి, రూరల్ సెస్ ఏఈ రిషిక, సిబ్బంది కార్యాలయం ఆవరణనను శుభ్రం చేయించారు. రూ.10 లక్షలు కేటాయించడంతో భవనాన్ని మరమ్మతు చేసి జూన్ 1 నుంచి పాత కార్యాలయం నుంచే విధులు నిర్వర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సెస్ వినియోగదారుల ప్రతినిధి వెంకన్న మాట్లాడుతూ సెస్ భవనం మరో పదేళ్లపాటు పనిచేస్తుందని చెప్పినప్పటికీ అప్పటి పాలకవర్గం పట్టించుకోలేదు. ఇటీవల 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించి అద్దె ఇల్లు ఖాళీ చేయడం శుభపరిణామం. ఇన్నాళ్లు అద్దె చెల్లిస్తూ వినియోగదారుల డబ్బులు వృథా చేశారు.



సెస్ కార్యాలయాన్ని చక్కదిద్దుతున్న డైరెక్టర్ దేవరాజం, సెస్ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ

ధాన్యం కొనుగోలు చేయాలి



పెద్దలింగాపూర్‌లో రోడ్డుపై వంటావార్పు చేస్తున్న రైతులు

- రోడ్డుపై వంట చేస్తూ నిరసన

ఇల్లంతకుంట(మానకొండూర్): రెండు నెలలుగా ధాన్యం తూకం వేయడం లేదంటూ మండలంలోని పెద్దలింగాపూర్‌లో రైతులు శనివారం నిరసన తెలిపారు. రోడ్డుపై కంచె వేసి, వంటావార్పు చేశారు. రాస్తారోకో చేసిన రైతులకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. రైతులు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పసుల వెంకటి మాట్లాడుతూ ధాన్యం తూకం వేసినప్పటికీ లారీలు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. తాలు పేరిట ఒక్కో బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, లారీ రావాలంటే బస్తాకు రూ.2 వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 30 శాతం ధాన్యం కూడా కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నరేందర్, ఏఎస్సై మోతీరామ్ రైతులతో మాట్లాడి.. లారీలు పంపిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.





యోగాతో ఆరోగ్యం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విధుల్లో నిరంతరం బిజీగా ఉండే పోలీసులు యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. తాడూర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం యోగా శిక్షకులు శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడక, వ్యాయామం, యోగాలను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ప్రతీ మూడు నెలలకోసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు పాల్గొన్నారు.



నోట్లు..ఫీట్లు

రూ.2 వేలు నోట్లు ఇకపై చెలామణిలో ఉండవు అన్న ఆర్‌బీఐ ప్రకటనతో జనం ఆందోళనకు గురవుతున్నారు. తమవద్ద ఉన్న ఒకటి, రెండు నోట్లను సామగ్రి కొంటూ బిల్లు చెల్లించేందుకు ఇస్తున్నారు. నోట్లు మార్చుకునేందుకు సెప్టెంబర్ 30 వరకు సమయం ఉందంటున్నప్పటికీ కొందరు వ్యాపారులు రూ.2వేలు నోట్లను తీసుకోవడం లేదు. మరికొందరూ తీసుకుంటున్నప్పటికీ చిల్లర ఇచ్చేందుకు ఇబ్బందిగా మారిందని పేర్కొంటున్నారు. అలాగే పట్టణంలో పలుచోట్ల ఉన్న డిపాజిట్ మిషిన్లు పనిచేయడం లేదు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

రేపు భాగ్యరెడ్డివర్మ జయంతి

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో సోమవారం మ్యాదరి భాగ్యరెడ్డివర్మ 135వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సీడీవో రాఘవేందర్ శనివారం తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తారని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని ఎస్సీడీవో కోరారు.

క్లుప్తంగా

జియో 5జీ సేవలు ప్రారంభం



5 జీ సేవలు ప్రారంభిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మారుమూల ప్రాంతాల్లో జియో సేవలను విస్తృతం చేస్తుందని, జియో 5జీ సేవలను వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం 5జీ సేవలను ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, నాయకులు చిన్నమల్లేశం, సందీప్, నర్సింలు, అందె సుభాష్, హసన్‌బాయి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ హౌస్ అధికారి ఎండీ ఖాజహుస్సేన్ వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు రాచర్ల తిమ్మాపూర్ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ కొలకాని చందుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వినోద్‌కుమార్ పరామర్శ



పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: సిరిసిల్ల 'సెస్' మాజీ చైర్మన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది దోర్నాల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఇటీవల లక్ష్మారెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, 'సెస్'డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకులు రాఘవరెడ్డి, బండ నర్సయ్యయాదవ్, కె.మల్లారెడ్డి, మ్యాన రవి, న్యాయవాది దోర్నాల సంజీవరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం ఉద్యమబాట

- నెల రోజులుగా కొనసాగుతున్న వీవోఏల సమ్మె
- కనీస వేతనం కోసం డిమాండ్
- అదనపు పనిభారంపై ఆవేదన



సమ్మె శిబిరంలో వీవోఏలు

గంభీరావుపేట(సిరిసిల్ల): మహిళా సంఘాల బలోపేతంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వీవోఏలు ఉద్యోగ భద్రత కోసం ఉద్యమబాట పట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలని.. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె నెల రోజులకు చేరింది. పనికి తగిన వేతనం చెల్లించాలని, అదనపు పనిభారం తగ్గించాలని వీవోఏలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని నెల రోజులుగా సమ్మెబాట పట్టారు.

444 మంది వీవోఏలు

జిల్లాలో మొత్తం 444 మంది వీవోఏలు పనిచేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు సమ్మె చేస్తున్నారు. మొదట ఆన్‌లైన్ సేవలు చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. తర్వాత మండలకేంద్రాల్లో నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం సమ్మె కొనసాగిస్తున్నారు. వీరి సమ్మెతో గ్రామైక్య సంఘాల అంతర్గత రుణాలు, బ్యాంకు రుణాల రికవరీలు నిలిచిపోయాయి.

పనిభారంతో సతమతం

లక్ష్యాన్ని పూర్తి చేస్తేనే వేతనాలు చెల్లిస్తామని చెబుతుండడంతో వీవోఏలు ఆందోళన చెందుతున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులు ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాలు, తీర్మానాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో సమన్వయపరచడంలో వీవోఏల పాత్ర కీలకం. కొత్త సంఘాల ఏర్పాటు, సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు రుణాలు, మొబైల్ డాటా ఎంట్రీ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తున్నారు. హరితహారంలో మొక్కల పంపిణీ, బతుకమ్మ చీరల పంపిణీ, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో వీవోఏలు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆవేదనను అర్థం చేసుకోవాలి



ఎక్కడా లేని విధంగా గ్రామస్థాయిలో అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వం మా ఆవేదనను అర్థం చేసుకోవాలి. నెల రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించాలి. – దేవలక్ష్మి, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

చందుర్తిలో భిక్షాటన



భిక్షాటన చేస్తున్న వీవోఏలు

చందుర్తి(వేములవాడ): తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చందుర్తిలో శనివారం భిక్షాటన చేపట్టారు. వీరికి బీజేపీ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు అల్లాడి రమేశ్ మాట్లాడుతూ వీవోఏల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, సిర్రం తిరుపతి, అంబాల శ్రీకాంత్, హన్మయ్యచారి పాల్గొన్నారు.

ఎప్పుడు సరిచేస్తారో..



పాలంలో పడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న సత్తయ్య

కోనరావుపేట(వేములవాడ): వరి పొలాల్లో 20 రోజులక్రితం పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తీగలను సరిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని నిమ్మపల్లిలో 20 రోజుల క్రితం వీచిన ఈదురుగాలులు, వర్షానికి పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ తీగలు పొలాల్లోనే పడి ఉన్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు పట్టించుకోవడంలేదు. పొలాల్లో పడిన విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయాలని మాజీ సర్పంచ్ బండ సత్తయ్య, రైతులు కోరుతున్నారు.

ఎన్నికల హామీని మరిచిన ప్రభుత్వం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ ఉద్యమంలో.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరిచిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ముస్తాబాద్‌లో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడం లేదని ఆరోపించారు. గతేడాది ముస్తాబాద్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని చెప్పిన కేటీఆర్, ఇప్పుడు అడ్మిషన్లు ప్రారంభమైనా ఎందుకు కళాశాలను ప్రారంభించడం లేదన్నారు. 30 పడకల ఆసుపత్రి హామీ ఏమైందో ప్రజలకు చెప్పాలన్నారు. వడగండ్లు, అకాలవర్షాలతో రైతులు నష్టపోతే ఇప్పటి వరకు రూపాయి నష్ట పరిహారం ఇవ్వలేదని, రైతు రుణమాఫీ చేయలేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి, మహేశ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నరేశ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డయల్ 100, 1930లలో ఫిర్యాదు చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. డీపీవో కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో శనివారం సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో ఐదు సైబర్ నేరాలు జరిగినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే డయల్ 100, 1930 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

దోషులకు శిక్షలు పడాల్సిందే..

వివిధ కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా కోర్టు డ్యూటీ అధికారులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. కోర్టు కానిస్టేబుళ్లను పెండింగ్ కేసుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కోర్టులు పురోగతిపై సూచనలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యేదాకా అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు కోర్టుకు సమర్పించడంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కువ కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ట్రయల్స్ సమయంలో పీపీల సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉమ్మడి జిల్లాలోని పోలీస్ అధికారులు, హోంగార్డులకు కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆస్పత్రిలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈనెల 20 నుంచి జూన్ 12 వరకు జరిగే శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఎస్పీ చంద్రయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు 'ఉపకారం'

- ఎన్ఎంఎంఎస్‌కు జిల్లాలో 41 మంది విద్యార్థుల ఎంపిక
- నెలకు రూ.వెయ్యి చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లాకు చెందిన విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ చాటారు. ఏటా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 2022–23 విద్యాసంవత్సరానికి డిసెంబర్‌లో పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 41 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో ప్రతిభ కనబర్చి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు.

ఏటా రూ.12 వేలు

సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించి, ప్రతిభావంతులైన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12వేల ఉపకార వేతనం అందిస్తోంది. ఉపకార వేతనాన్ని విద్యార్థి బ్యాంకు ఖాతాలోనే నేరుగా జమ చేస్తోంది. దీంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి కొనుగోలు చేసుకునే వీలు కలుగుతుంది.

పట్టుదలతో చదివా



ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపిక కావాలని పట్టుదలతో చదివా. ఉపాధ్యాయుల శిక్షణతో అనుకున్నది సాధించాం. ఇప్పుడు నాలుగేళ్లపాటు మా చదువుకు కొంత భరోసా వచ్చింది. మాలాంటి పేద విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ వరం లాంటిది.

– అబ్బుతిని వరుణ్, విద్యార్థి, కొత్తపల్లి

ఉపాధ్యాయుల శిక్షణతోనే..



ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం ఉపాధ్యాయులు మా పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అవి మాకు దోహదపడ్డాయి. మెంటల్ ఎబిలిటీ, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులను బోధించారు. ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది.

– తుమ్మల సందీప్, విద్యార్థి, కొత్తపల్లి

ఏటా ప్రత్యేక శిక్షణ



జాతీయ ఉపకార వేతనాల ఎంపిక పరీక్ష కోసం మా పాఠశాలలో విద్యార్థులకు ఏటా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. దీంతో మా పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. దీనికి ఉపాధ్యాయుల సహకారం ఉంది.

– సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు, కొత్తపల్లి

పంచాయతీ సిబ్బందిపై విచారణ

గంభీరావుపేట(సిరిసిల్ల): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత శనివారం విచారణ చేపట్టారు. మండల పరిషత్‌లో అవినీతి ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారుల నుంచి, పంచాయతీ సిబ్బంది నుంచి వాంగ్మూలాలు స్వీకరించారు. సమగ్ర విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు గీత తెలిపారు. విచారణలో ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థిని మృతి

- రామన్నపేటలో విషాదం



ఆరుక్ష పూలే(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తండ్రి అనారోగ్యంతో మంచం పట్టగా.. తల్లికి తోడుగా పొలం పనుల్లో సాయంగా నిలుస్తున్న ఇంటర్ విద్యార్థినిని ఫిట్స్ బలితీసుకున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన దుమ్ము శ్యామల–ఆనందం దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఆరుక్ష పూలే ఇంటర్, చిన్నకుమార్తె సాగరిక పదో తరగతి పూర్తి చేశారు. వేసవి సెలవులు రావడంతో ఇద్దరు కుమార్తెలు ఇంటి వద్దే ఉంటున్నారు. తండ్రి ఆనందం అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉండగా.. వ్యవసాయ పనుల్లో తల్లికి తోడుగా పెద్ద కూతురు ఆరుక్ష పూలే రెండు రోజులుగా వెళ్తోంది. శనివారం పనులు చేస్తుండగానే కింద పడిపోయింది. ఫిట్స్ వచ్చాయన్న అనుమానంతో ప్రథమ చికిత్స చేశారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు వచ్చి పరీక్షించేలోపే విద్యార్థిని మృతిచెందింది. వ్యవసాయ పనులకు వెళ్లడంతో వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ అంజయ్య కోరుతున్నారు.

తాగిన మైకంలో యువకుడి ఆత్మహత్య



రాము మృతదేహం

సిరిసిల్లటౌన్: తాగిన మైకంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సిరిసిల్ల పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నెహ్రూనగర్‌లో గుల్లె రాము(27) డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సౌమ్యతో ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రాము ఇటీవల ఏ పనిచేయకపోవడంతో ఇంట్లో గొడవలు అవుతున్నాయి. శుక్రవారం బాగా మద్యం సేవించిన అతడు తాగిన మైకంలో శనివారం వేకువజామున చీరతో ఉరేసుకొని చనిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

వీర్నపల్లి(సిరిసిల్ల): అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నవత వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండల కేంద్రం నుంచి సిరిసిల్ల పట్టణానికి ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు కంచర్ల వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. సిరిసిల్ల పాత బస్టాండు సమీపంలో నేతన్న చౌక్ వద్ద టౌన్ సీఐ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్, పోలీసులు తనిఖీలు చేపట్టారు. మందుబాబులు మద్యం తాగి వాహనాలపై రావడంతో బ్రీతింగ్ పరీక్షలు చేశారు. మందు తాగినట్లు నిర్ధారణ అయిన వారి వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాగి బండి నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 100 గ్రాముల గంజాయి స్వాధీనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట శివారులోని ఎల్లమ్మ గుడివద్ద గంజాయి విక్రయిస్తున్న ఎల్లారెడ్డిపేటకు చెందిన దుబ్బ రాహుల్(22)ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌హౌస్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఎల్లమ్మ గుడివద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేయగా.. రాహుల్ గంజాయితో పట్టుబడ్డాడు. రాహుల్ 2020లో కరీంనగర్‌లో గంజాయిని విక్రయిస్తుండగా అక్కడి పోలీసులు పట్టుకున్నారు. జైలు నుంచి విడుదల కాగానే జల్సాలకు అలవాటుపడి తిరిగి గంజాయి విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ ఘటనపై విచారించిన సీఐ మొగిలి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయమూర్తి నిందితునికి 15 రోజుల రిమాండ్ విధించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి విక్రయించడం, తాగడం నేరమన్నారు. గంజాయి విక్రేతల గురించి తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

రెప్యూటెడ్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రాబోయే విద్యాసంవత్సరానికి రెప్యూటెడ్ కాలేజీల్లో అర్హులైన బీసీ ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీడీవో మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గత మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి 7.0 పైన జీపీఏ సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. కస్తూర్బా, మోడల్‌స్కూల్స్, సంక్షేమ వసతి గృహాలలో చదువుకున్న వారు, మున్సిపల్, జెడ్పీ హైస్కూళ్లలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. జూన్ 3వ తేదీలోపు నిర్దేశిత ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి మెమో, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో telanganaeparr.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో కనీసం మూడు కళాశాలలను ప్రతిపాదించాలని సూచించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



ముఖం దాచుకుంటున్న ట్రాక్టర్ డ్రైవర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. శివారు గ్రామమైన గండిలచ్చపేట నుంచి ఇసుక దందా జోరుగా సాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాగు నుంచి ఇసుకను తోడి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక నేతల అండదండలతోనే ఇసుక దందా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు ఆన్‌లైన్ మోసానికి గురై నగదు పోగొట్టుకున్నాడు. వివరాలు.. డిగ్రీ వరకు చదివిన సదరు యువకుడు కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ పేరుతో ఫోన్ కాల్ వచ్చింది. రిజిస్ట్రేషన్ కోసం అంటూ రూ.3 వేలు, చార్జీలు అంటూ రూ.5 వేలు ఇలా మొత్తం రూ.20 వేల వరకు వసూలు చేసిన సదరు సైబర్ నేరగాళ్లు గంటపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహించారు. అపాయింట్‌మెంట్ లెటర్ కోసం మరో రూ.20 వేలు కట్టాలని అనడంతో సంస్థ వివరాలు సరిచూసుకుని మోసపోయామని బాధితుడు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్ సెల్ 1930కు డయల్ చేసి వివరాలు చెప్పాడు. అనంతరం తంగళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.